# "నిన్ను నీవు తెలుసుకో"

**ప్రేమస్వరూపులారా!** ఏ మానవుడు 'తనయందున్న ఆత్మ, పరుల యందున్న ఆత్మ ఒక్కటే' అని విశ్వసించునో, అట్టివాడు గృహస్థుడైనా, రక్తుడైనా, విరక్తుడైనా భగవంతుడు అతనియందు నివాసియై ఉంటాడు. అతనే భగవంతునిగా మారుతాడు. భగవంతుని తత్త్వమును గుర్తించలేక అనేకమంది విమర్శిస్తుంటారు. అయితే, అర్థం చేసుకున్నటువంటివారు అదృష్టవంతులు. భగవంతుడు సత్యమునందు, అసత్యమునందు, ధర్మము నందు, అధర్మమునందు, పుణ్యమునందు, పాపమునందు సమత్వంగా ఉంటున్నాడు. ఇట్టి పవిత్రమైన ఏకత్వమును గుర్తించే నిమిత్తం ప్రాచీన ఋషులు అనేక విధములుగా ప్రయత్నించారు. ఎన్నో పరిశోధనలు సల్పారు. కడపటికి "వేదాహమేతం పురుషం మహాన్తం ఆదిత్యవర్ణం తమసః పరస్తాత్" (అజ్ఞానమనే తమస్సుకు ఆవల కోటిసూర్యుల మేటికాంతితో ప్రకాశిస్తున్న భగవంతుణ్ణి మేము చూశాము) అని ప్రపంచానికి చాటుతూ వచ్చారు.

మానవత్వములో ఉన్న దివ్యత్వమును ప్రాకృత అనుభూతులయందు మనము అవగాహన చేసుకోవచ్చును. అవి దైవమును ప్రత్యక్షంగా చూపించకపోయినప్పటికీ దైవత్వముయొక్క ఉనికిని నిరూపిస్తాయి. కొద్ది సేపటి క్రింద మీరు లయన్ డ్యాన్స్ (సింహనృత్యం) చూశారు. అవి నిజమైన సింహములు కావు. కాని, వాటిద్వారా నిజమైన సింహములు ఎలా ఉంటాయో గుర్తించడానికి సాధ్యమవుతుంది. అదేవిధముగా, ఈ ప్రపంచమునందున్న ప్రతి పదార్థము, ప్రతి అనుభూతి దివ్యత్వమును గుర్తింపజేస్తుంది. చెఱకులోని తీపి, మిరపలోని కారము, చింతలోని పులుపు, వేపలోని చేదు – ఇవన్నీ దైవత్వముయొక్క ఉనికిని గుర్తింపజేసే చిహ్నములే! సూర్యుడు ప్రకాశిస్తున్నాడు. చంద్రుడు చల్లదనాన్ని అందిస్తున్నాడు. నక్షత్రాలు వెలుగుతున్నాయి. తరంగాలు కదులుతున్నాయి. ఇవన్నీ భగవత్తత్త్వమునకు నిదర్శనములే! ఇవి భగవంతుణ్ణి చూపించక పోయినప్పటికీ భగవత్తత్త్వమును నిరూపిస్తున్నాయి.

**సృష్టి, స్థితి, లయములు దైవాధీనములు**

ఈ జగత్తంతయు సృష్టి, స్థితి, లయములనే మూడు విధములైన కర్మలతో నిండియున్నది. ఈ సత్యమును ఎవరూ, ఏ సైంటిస్టుకూడా కాదని చెప్పలేదు. జగత్తులో ఇది నిత్యము మనకు కనిపిస్తూనే ఉన్నది. సృష్టింప బడినది పోషింపబడుతున్నది; పోషింపబడినది లయము గావింప బడుతున్నది. ఇది ప్రత్యక్ష ప్రమాణము. ఈ మూడు విధములైన కర్మలను చక్కగా విచారణ చేసినప్పుడు, దివ్యత్వము మనకు గోచరమవుతుంది. ప్రాకృతమైన వ్యవహారములలో విద్యాశాఖకు ఒక మంత్రి ఉంటాడు; రెవెన్యూ శాఖకు ఒక మంత్రి ఉంటాడు; పోలీసు శాఖకు ఒక మంత్రి ఉంటాడు. అయితే, వీరందరూ ప్రధానమంత్రికి అధీనులై ఉంటారు. అదేరీతిగా, సృష్టికి అధిపతి బ్రహ్మ అనియు; రక్షణకు అధిపతి విష్ణువనియు; శిక్షణకు అధిపతి శివుడనియు వేరువేరు పేర్లతో కర్మలు ఆచరిస్తున్నప్పటికీ ఈ మూడింటికీ అధిపతి దైవమే. అతనినే మహమ్మదీయులు 'అల్లా' అన్నారు. క్రైస్తవులు (GOD) అన్నారు. G - Generation (సృష్టి). O - Organisation (స్థితి). D - Destruction (లయము). కనుక, GOD అనే పదములోనే సృష్టి, స్థితి, లయములు చేరి ఉంటున్నాయి. ఇటువంటి లౌకికమైన ఆధారములు తీసికొని దివ్యత్వముయొక్క ఉనికిని నిరూపించ వచ్చును. ఒకరు చెప్పినా, చెప్పకపోయినా సత్యము సత్యమే! దైవం ఉన్నాడు. ఎక్కడున్నాడు? సర్వులయందున్నాడు, సర్వ స్వరూపుడై ఉన్నాడు. మానవత్వంలోని దివ్యత్వము సర్వులకు గోచరమవుతూనే ఉన్నది. ఈనాడిన్ని లక్షలమంది స్వామిపట్ల ప్రేమతో ఇక్కడికి వచ్చారు. ఈ ప్రేమయే దివ్యత్వమునకు ప్రధానమైన చిహ్నం. ఇందరు తమ ప్రేమను స్వామియందు నిలుపుకుంటున్నారు. ఇంతకంటే

ఆనందము మరొకటి లేదు.

ప్రేమస్వరూపులారా! ఈనాడు నేను మీకు ఏమి చెప్పగలను! ఈ దృశ్యమును చూస్తుంటే, నా హృదయము ఆనందంతో నిండిపోతున్నది. ఇందరి ప్రేమకు పాత్రుడైన నా ఆనందమునకు హద్దు లేదు. మిమ్మల్ని నేను ఆహ్వానించలేదు. నాయందున్న ప్రేమయే మిమ్మల్ని ఇక్కడకు తీసికొని వచ్చింది. ప్రేమయే నేనందించే ప్రధానమైన సందేశము. మీరందరూ క్షేమంగా ఉండాలి; ఆనందంగా ఉండాలి; ఆధ్యాత్మికతత్త్వాన్ని అభివృద్ధి పరచుకోవాలి. జగత్తును ఉద్ధరించాలి. అందరియందున్న దైవత్వము ఒక్కటే అన్న భావముతో జీవితాన్ని గడపాలి.

**మానవ జీవితమంతయు 'రియాక్షన్', 'రిఫ్లెక్షన్', 'రిసౌండ్'**

ప్రేమస్వరూపులారా! ఇతరులు మనలను ప్రేమించాలంటే, గౌరవించాలంటే మొట్టమొదట మనము ఇతరులను ప్రేమించాలి, గౌరవించాలి. మానవజీవితమంతయు 'రియాక్షన్', 'రిఫ్లెక్షన్', 'రిసౌండ్'లతో కూడినది. కనుక, మనము అందరినీ ప్రేమించాలి. అప్పుడే మనము అందరి ప్రేమకు పాత్రులమవుతాము. అందరినీ మనము గౌరవించాలి. అప్పుడే అందరూ మనలను గౌరవిస్తారు. ఇతరులు మనకు ఏది చేయాలని ఆశిస్తున్నామో మొట్టమొదట దానిని మనము ఆచరించాలి. ప్రభుత్వమువారు కొంతమంది పోలీసువారిని, కొంతమంది మిలట్రీవారిని నియమిస్తారు. దేనికోసం? దేశాన్ని కాపాడే నిమిత్తం. దోషము చేసినవారిని పోలీసులు శిక్షిస్తారు. దోషమే చేయకుండిన పోలీసులు శిక్షించడానికే వీలులేదు. అదేవిధముగా, మంచి చేసినవారికి మంచి ఫలితమును అందించడానికి, చెడ్డ చేసినవారికి చెడ్డ ఫలితమును అందించడానికి భగవంతుడు కొన్ని శక్తులను నియమించాడు. కాని, ఈ సత్యాన్ని గుర్తించుకోలేక కొందరు భగవంతుణ్ణి దూషిస్తుంటారు. ఇది చాలా పొరపాటు. ముందు మీరు దుష్కర్మలకు దూరంగా ఉండండి. దుర్భావాలను దూరం చేసుకోండి. అప్పుడు ఎవ్వరూ మిమ్మల్ని శిక్షించరు. శిక్షించే వ్యక్తులుకూడా వచ్చి రక్షిస్తారు.

**ఆత్మతత్త్వమే నీవని గుర్తించు**

మానవుడంటే ఆత్మస్వరూపుడని చెప్పాను. ఆత్మ శాశ్వతమైనదని కూడా చెప్పాను. వేదాంతము 'నిన్ను నీవు తెలుసుకో' అని బోధించింది. ఈనాటి మానవుడు ఇతరులను 'నీవెవరు?' అని ప్రశ్నిస్తున్నాడేగాని, 'నేనెవరు?' అని తనను తాను ప్రశ్నించుకోవడం లేదు. తన రూప నామములను పురస్కరించుకొని తాను ఫలానావాడనని అంటున్నాడు. తన దేశమును పురస్కరించుకొని తాను ఫలానా దేశీయుడనని చెబుతున్నాడు. తన వృత్తిని పురస్కరించుకొని తాను ఫలానా పని చేసేవాడినని అంటున్నాడు. కాని, ఇవేవీ సరియైన జవాబులు కావు. 'నీవెవరు?' అన్న ప్రశ్నకు 'నేను ఆత్మను' అన్నదే సరియైన జవాబు. దేహము, మనస్సు అనిత్యమైనవి. వాటిని నీవుగా భావించుకోవడం పొరపాటు. మనో దేహములకు శక్తినిచ్చే ఆత్మతత్త్వమే నీవని గుర్తించాలి. ప్రతి వ్యక్తీ ఆత్మ స్వరూపుడేగాని, అన్యస్వరూపుడు కాదు. అతని స్వరూపమే సర్వత్రా వ్యాపించియున్నది. సర్వత్రా వ్యాపించిన 'కాస్మిక్ పవర్' అది. దానిని గుర్తించుటకు మీరు ప్రయత్నించాలి. అది ఎంతో కష్టమని మీరు భావిస్తున్నారు. కాని, దానికంటే సులభమైనది మరొకటి లేదు. మీరు దేహాభిమానమును పెంచుకోవడంచేతనే అది మీకు కష్టమనిపిస్తున్నది.

**ఈ ప్రపంచము ఒక అద్దాలగదివంటిది**

"సర్వ భూత నమస్కారః కేశవం ప్రతిగచ్ఛతి" అన్నారు. ఎవరికి నమస్కరించినా దైవానికే నమస్కరించినట్లవుతుంది. ఎందుకంటే, సర్వుల యందు దైవత్వం ఉన్నది. "మమైవాంశో జీవలోకే

జీవభూతస్సనాతనః" అన్నాడు, కృష్ణుడు. ఒక అద్దాలగదిలో ఒక తెలివితక్కువ పక్షి ప్రవేశించింది. తన చుట్టూ ఉన్న అద్దాలలో ప్రతిబింబిస్తున్న తన రూపాన్ని చూసి, అవి తన శత్రువులేమో, తనను బాధిస్తాయేమో అన్న భావంతో క్రోధమును పూని, ఆ అద్దాలను కొట్టి కొట్టి ముక్కలు చేసింది. అయితే, అవి ఎన్ని ముక్కలైనాయో వాటిలో అన్ని ప్రతిబింబములు కనిపించసాగాయి. దానితో ఆ పక్షి మరింత రెచ్చిపోయింది. ఇది అజ్ఞానముయొక్క ప్రభావము. అదే అద్దాలగదిలో ఒక ప్రజ్ఞానవంతుడైన మానవుడు ప్రవేశిస్తే, తన చుట్టూ కనిపించేవన్నీ తన ప్రతిబింబములే కదా, అని ఆనందిస్తాడు. తనలోని దోషాలను నిర్మూలించు కుంటాడు. 'అన్నీ ప్రతిబింబములే', అన్న సత్యాన్ని గుర్తించి, వర్తించేవాడే నిజమైన మానవుడు. రూపనామములందు, శక్తులందు మీకు భిన్నత్వము గోచరించవచ్చునుగాని, 'నీవు, నేను' ఒక్కటే అనే సత్యాన్ని గుర్తించడమే నిజమైన జ్ఞానము. దైవము మందిరమునందు, మసీదునందు, దర్గాల యందు ప్రత్యేకంగా లేదు. మీయందే ఉన్నాడు. మీయందున్న దివ్యత్వమునే దర్గాకు వెళ్ళినప్పుడు దర్శిస్తున్నారు. మందిరమునకు వెళ్ళినప్పుడుకూడా మిమ్మల్నే మీరు దర్శించుకుంటున్నారు. మీరు ఏ సాధనలు చేసినప్పటికీ మీయందున్న సత్యాన్ని మీరు గుర్తించుకునేటందులకే!

### సృష్టి అంతా ఏకత్వమే, దృష్టిలోనే ఉంది భిన్నత్వము

ప్రతి మానవునికి జనన, మరణాలుంటున్నాయి. ఈ రెండింటి మధ్య జీవితమున్నది. అది తరుగుతుంది, పెరుగుతుంది. కాని, మానవత్వము పెరిగేదీ కాదు, తరిగేదీ కాదు. దేహము పెరుగుతుందిగాని, తాను పెరగడం లేదు, తరగడం లేదు. ఒక వ్యక్తిని చిన్నతనమునందు 'ఛైల్డ్' అన్నారు; యౌవనములో 'మేన్' అన్నారు. వార్ధక్యమునందు 'గ్రాండ్ ఫాదర్' అన్నారు. ఈవిధంగా, రూపము మారుతున్నదిగాని, మనిషి ఒక్కడే కదా! మనకు కనిపించే రూపనామములు వేరు కావచ్చుగాని, దైవశక్తి ఒక్కటే! ఈ సత్యాన్ని మీరు గుర్తించి, అందరినీ ప్రేమిస్తే, మీరే దైవంగా మారిపోతారు. 'అందరి యందున్న దైవత్వము ఒక్కటే', అని గుర్తించినప్పుడు మీకు ఎలాంటి భేదములూ ఉండవు. గుర్తించుకోలేకపోవడం మీ దృష్టిదోషమేగాని, సృష్టి దోషము కాదు. మీ దృష్టిదోషాన్ని మీరు సవరించుకోకుండా సృష్టిలో దోషాలను వెతుకుతున్నారు. భగవంతుని సృష్టిలో ఎలాంటి దోషమూ లేదు. సర్వమూ ఏకత్వంగానే ఉన్నది. మీ దృష్టిలోనే ఉన్నది భిన్నత్వము.

### ఆత్మవిశ్వాసము గలవారికి అన్నింటిలోనూ విజయమే!

ప్రతి మానవునికి ఆత్మవిశ్వాసము అత్యవసరము. ఆత్మవిశ్వాసముతో ఏ కార్యములో ప్రవేశించినా, తప్పక విజయాన్ని సాధిస్తారు. అమెరికాలో అతి బీదకుటుంబములో పుట్టాడు, లింకన్. తండ్రి వడ్రంగి పని చేసేవాడు. తల్లి పాత గుడ్డలను కుట్టి, తద్వారా వచ్చిన డబ్బుతో అబ్బాయిని పోషించుకుంటూ వచ్చింది. ఈ పిల్లవాడు, షాహుకారు బిడ్డలతో కలిసి స్కూలుకు వెళ్ళేవాడు. వారంతా ఇతని డ్రస్సును చూసి హేళన చేసేవారు. చిన్నపిల్లవాడైన లింకన్ ఒకనాడు ఏడుస్తూ తల్లిదగ్గరకు వచ్చి, "అమ్మా! నా తోటిపిల్లలు నన్ను అవమానం చేస్తున్నారు. నాకు మంచి డ్రస్సులు కుట్టించు", అన్నాడు. అప్పుడు తల్లి అతనిని దగ్గరకు చేరదీసి, "నాయనా! మొట్టమొదట నీవు మన కుటుంబముయొక్క పరిస్థితిని గుర్తించు. మనము చాలా బీదవారము. తినడానికే తిండిలేని మనము ఏవిధంగా మంచి గుడ్డలు ధరించడానికి వీలవుతుంది? నీవు మన స్థితికి తగిన గతిని అనుసరించాలి. ఇతరులు నిన్ను ఎంత గేలి చేసినా నీవు లెక్కచేయవద్దు. ఆత్మవిశ్వాసంతో జీవించు. ఏనాటికైనా నీవు అభివృద్ధికి వస్తావు", అని బోధించింది. అప్పటి నుండి లింకన్ ఆత్మవిశ్వాసమును పెంచుకున్నాడు. కష్టపడి చదివాడు. ఆత్మవిశ్వాసమే తనకు రక్ష అని భావించాడు. అతనివద్ద ధన, కనక, వస్తు, వాహనాదులు లేకపోయినప్పటికీ ఆత్మవిశ్వాసమనే ధనము నిండుగా, దండిగా ఉండినది. కొంతకాలానికి తల్లి మరణించింది.

కాని, ఆమె చేసిన బోధలు అతని హృదయంలో చిరస్థాయిగా నిలిచిపోయాయి. తండ్రి రెండవ పెండ్లి చేసుకున్నాడు. ఇది విదేశీయులకు సహజమే. అయితే, సవతి తల్లి కూడా లింకన్‌ను చాలా ప్రేమగా చూసుకుంది. ఆమెకూడా "నాయనా! నీ తల్లి చెప్పినట్లుగా నీవు ఆత్మవిశ్వాసంతో జీవించు", అని బోధించేది. కాని, క్రమక్రమేణ అతనికి అనేక కష్టాలు ఎదురైనాయి. ఏదైనా ఉద్యోగం చేయాలనుకున్నాడు. కాని, ఉద్యోగం చేయడంకంటే స్వశక్తిపై ఆధార పడడం మంచిదనే ఉద్దేశ్యంతో వ్యాపారం చేస్తూ వచ్చాడు. ఆ వ్యాపారమునుకూడా పూర్తి సత్యమైన మార్గములో చేశాడు. క్రమక్రమేణ తోటివారు అతనిని మోసం చేశారు. కొందరు మంచిని చూసి ఓర్వలేరు. ఎదుటివారి అభివృద్ధిని చూసి సహించలేరు. ఇది అనాదికాలమునుండి జరుగుతూనే వస్తున్నది. చివరికి, లింకన్‌కు వ్యాపారంలో నష్టం వచ్చింది. అతడితరులకు కొంత డబ్బు ఋణపడినాడు.

**అన్నదానముకన్న అధిక దానంబేది!**
**తల్లిదండ్రులకన్న దైవమేది!**
**జపతపంబులకన్న సత్యశీలంబేది!**
**దయకంటె ఎక్కువ ధర్మమేది!**
**సుజన సంగతికన్న చూడ లాభంబేది!**
**క్రోధంబుకన్న శత్రుత్వమేది!**
**ఋణముకంటెను నరులకు రోగమేది!**
**ధరణి నపకీర్తికంటెను మరణమేది!**
**సర్వదా కీర్తికంటెను సంపదేది!**
**స్మరణకంటెను మించి ఆభరణమేది!**

కనుకనే, అతడు తనవద్దనున్న చిన్నచిన్న మిషన్లను అమ్మివేసి, ఆ ఋణాన్ని తీర్చివేశాడు. అతని సత్యశీలమును గుర్తించిన స్నేహితులు కొందరు అతనిని ఎలక్షన్లలో పోటీ చేయవలసిందని ప్రోత్సహించారు. అతనికి కావలసిన సహాయం చేస్తామని మాటిచ్చారు. ఆ నమ్మకంపైన లింకన్ ఎలక్షన్లలో పోటీ చేసి, దిగ్విజయం సాధించాడు. క్రమక్రమేణ అందరూ చేరి, అతనిని ప్రెసిడెంటుగా చేశారు. ఆరోజుల్లో అమెరికాలో తెల్లవారు నల్లవారిని బానిసలుగా చేసుకొని, చాలా హింసించేవారు. ఇది చూసి లింకన్ చాలా బాధ పడ్డాడు. లోకంలో అందరూ సమానులే. అందరూ భగవంతుని బిడ్డలే. కాబట్టి, ఇలాంటి భేదములు ఉండకూడదనే ఉద్దేశ్యంతో, తాను ప్రెసిడెంటు అయిన తరువాత బానిసత్వాన్ని నిర్మూలిస్తూ చట్టాన్ని అమలు చేశాడు.

**అసూయ వేరుపురుగువంటిది**

ఈ లోకంలో మంచి, చెడ్డలకు సంఘర్షణ జరుగుతూనే ఉంటుంది. ఎవరైనా మంచిపేరు తెచ్చుకుని అభివృద్ధికి వస్తున్నారంటే, వారిపైన అసూయతో లేనిపోని అపోహలు కల్పిస్తుంటారు. అసూయ వేరుపురుగు వంటిది. వేరుపురుగు పైకి కనిపించదుగాని, అది ప్రవేశించిందంటే, ఫలపుష్పాదులతో కళకళలాడే వృక్షమైనా కూలిపోక తప్పదు. అదేరీతిగా, అసూయ ప్రవేశించిందంటే మనిషికి పతనం తప్పదు. కొందరు తమయందు అసూయను గోప్యంగా పెట్టుకొని దుష్ప్రచారం చేస్తుంటారు. వాటిని మనము ఏమాత్రము లెక్కచేయకూడదు. మన భారతదేశంలో ఎందరో మహనీయులు ఇలాంటి పరిస్థితిని ఎదుర్కొని విజయాన్ని సాధించారు. సత్యమునకు కట్టుబడినవారికి, ప్రేమతో జీవించేవారికి ఏనాటికీ ముప్పు రాదు. దేహము ఏనాటికైనా పోయేటటువంటిదే! దానిని రక్షించుకునే నిమిత్తం పెడమార్గం పట్టరాదు. దేహము పోతుందేగాని, మన సత్యము శాశ్వతంగా

నిలుస్తుంది. కాబట్టి, సత్యముకోసం పాటుపడాలి.

**దైవాన్ని దూషించేవారు నాల్గు రకాలు.**

కొందరు తమ మనోభీష్టములు నెరవేరనప్పుడు దైవానికి విరుద్ధమైన మార్గాన్ని అవలంబిస్తారు. ఇది వారి దోషమేగాని, నా దోషము కాదు. లోకంలో దైవాన్ని దూషించేవారు నాల్గు రకములుగా ఉంటున్నారు. అసలు దేవుడంటేనే నమ్మకం లేనివారు మొదటిరకంవారు. ఇతరులు అభివృద్ధికి రావడం చూసి ఓర్చుకోలేక ద్వేషించేవారు రెండవరకంవారు. తమ  కోరికలు నెరవేరకపోవడంచేత ద్వేషించేవారు మూడవరకం. "అతనికి వచ్చిన ఉన్నత స్థితి పేరు, ప్రతిష్ఠలు నాకు రాలేదే", అని ఏడ్చేవారు నాల్గవరకం. ఈ నాల్గురకములైన వ్యక్తులు తప్ప దైవాన్ని ఎవ్వరూ దూషించరు. కొందరు తుచ్ఛమైన భావంతో ఏదో ఒక అభీష్టమును వ్యక్తం చేస్తారు. "స్వామీ! మీరు నాకీ పని చేయాలి. నేనొక సొసైటీ పెట్టుకుంటున్నాను. ఒక స్కూలును స్థాపిస్తున్నాను. నాకింత డబ్బు కావాలి", అని అడుగుతారు. నేను సత్యమే చెబుతాను. "నాయనా! నీ దేశం వేరు, ఈ దేశం వేరు. ఈ దేశం డబ్బు నీ దేశంలో చెల్లదు. ఈ డబ్బును తీసుకుపోవాలంటే మనము గవర్నమెంటును మోసం చేయాలి. దానిని నేను అంగీకరించను", అంటాను. అలాంటి పరిస్థితిలో వారు నాపైన ద్వేషము పూని నాకు వ్యతిరేకంగా అనేక రకములుగా ప్రచారం చేస్తారు. ఎవరు ఏమి చేసినా నా సత్యము నాదే! ఎవరు దూషించినా మీరు లెక్కచేయకూడదు. ఎందుకంటే, మీ నమ్మకం మీది. దైవత్వము నమ్మకంపైన ఆధారపడినది. నమ్మకం ఒకరు కల్పించేది కాదు. ఎవరి నమ్మకం వారిది. అందువల్లనే, త్యాగరాజు ఒకానొక సమయంలో చెప్పాడు, "ఓ భగవంతుడా! ఎవరు ఎంతమాత్రమని తలచిన అంతమాత్రమే నీవు". ఎవరు ఏవిధమైన భావముతో తలుస్తారో వారికి ఆవిధమైన ఫలితమే ప్రాప్తిస్తుంది. కొందరు దైవము ఉన్నాడంటారు, మరికొంతమంది లేదంటారు. దైవము ఉన్నాడన్న వారికి ఉన్నాడు, లేదన్నవారికి లేదు.

**'యెస్' అనువారికి 'యెస్' అనురా**
**'నో' అనువారికి 'నో' అనురా**
**'నో', 'యెస్'లు మీ నోటికెగాని**
**సాయికి సర్వం 'యెస్', 'యెస్', 'యెస్'.**

ఎవరి మనస్సు వారికి సాక్షి. కాబట్టి, మీరు ఇతరుల మాటలు నమ్మి, మీ నమ్మకమును, ఆత్మతత్త్వమును వదలిపెట్టకూడదు. నా సత్యము ఒక్కటే. అందరూ నావారే. నేను అందరివాడనే. ప్రేమ ఒక్కటే నా ప్రోపర్టీ. ఆ ప్రేమచేతనే నేను అందరినీ ఆదరిస్తుంటాను. నాపై ద్వేషం పూని నన్ను ఆశ్రయించినవారినికూడా ప్రేమిస్తాను. నా దృష్టిలో దుర్మార్గులే లేరు. ఎందుకంటే, వారి చేష్టలు ఈనాడు ఒక విధంగా ఉంటాయి; రేపు మరొక విధంగా మారుతాయి. నేను తప్పొప్పులను పట్టించుకోను. వారి ద్వేషాన్ని అంతకంటే చూడను. నా ప్రేమను నేను చూసుకుంటాను. ఇలాంటి 'ప్యూరిటీ' (పవిత్రతను) మీరు అభివృద్ధి చేసుకున్నప్పుడే మీలో 'డివినిటీ' (దివ్యత్వం) ఆవిర్భవిస్తుంది. 'ప్యూరిటీ' కావాలంటే మీలో 'యూనిటీ' (ఐకమత్యం) ఉండాలి.

**ఐకమత్యం లేని స్వాతంత్ర్యం నిరర్థకం**

ప్రేమస్వరూపులారా! ఈనాడు మనం భారతదేశాన్ని సరియైన స్థితిలో తీర్చి దిద్దుకోవాలంటే అందరూ ఐకమత్యంగా ఉండాలి. మన ప్రాచీన నాయకులు అనేక త్యాగాలు చేసి, స్వాతంత్ర్యమును సాధించారు. కాని, ఐకమత్యమును సాధించలేకపోయారు. ఐకమత్యము లేకపోతే స్వాతంత్ర్యమును సాధించి ప్రయోజనమేమిటి?

ఈనాడు ఎక్కడ చూసినా ద్వేషాలే! ఒకే పార్టీలో పది పార్టీలు కనిపిస్తున్నాయి. ఇలాంటి పరిస్థితిలో మనము ఏరీతిగా సుఖాన్ని పొందగలము? మొట్టమొదట దేశాభిమానాన్ని పెంపొందించుకోవాలి. దేశక్షేమాన్ని లక్ష్యమునందుంచుకోవాలి. భారత దేశంలో ఉన్న పవిత్రత మరొక దేశములో లేదు. అందువల్లనే, భారతదేశంలో అనేక అవతారములు ఉద్భవించాయి. "భారతదేశమను బంగారు మనకుండ పర దేశముల నున్న మట్టి ఏల?" భారతదేశము అన్ని దేశాలకూ తల్లివంటిది. రాముడు "జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ", అన్నాడు. అనేకమంది రాముణ్ణి స్మరిస్తున్నారుగాని, రాముని వాక్యములను ఎంతమంది ఆచరిస్తున్నారు? స్మరించడంలో హీరోలు, ఆచరించడంలో జీరోలు!

**భక్తుల ఆనందమే నా ఆనందము**

ప్రేమస్వరూపులారా! ఈనాడు ఈ దేహమునకు 75 వ పుట్టినరోజు అంటున్నారు. కాని, నాకు ఈ వయస్సుతో సంబంధం లేదు. నాకు ఎప్పుడూ ఈ పుట్టినరోజులు చేసుకోవాలని ఆశ లేదు. కాని, భక్తులందరూ చేరడంచేత, కోరడంచేత ఈ పండుగను జరుపుకోవడానికి అంగీకరించాను. నాకు ఎలాంటి కోరికా లేదు. భక్తుల ఆనందమే నా ఆనందము. జగత్తుయొక్క క్షేమమే నాకు ప్రధానమైనది. కష్టజీవులను ఆదరించి, వారి కష్టాలను తీర్చడమే నా ప్రధాన కర్తవ్యము. ఎవరు ఏవిధంగా చాటినప్పటికీ నా దీక్ష మారదు. మీరుకూడా ఇలాంటి దృఢమైన దీక్ష పూనాలి.

**పట్టిన పట్టేదొ పట్టనే పట్టితివి**
**పట్టునెగ్గెడుదాక అట్టెయుండు**
**కోరినదేదియో కోరనే కోరితివి**
**కోర్కె చెల్లెడుదాక కొలచియుండు**
**అడిగినదేదియో అడుగనే అడిగితివి**
**అడిగినదిడుదాక విడువకుండు**
**తలచినదేదియో తలచనే తలచితివి**
**తలపు తీరెడుదాక తరలకుండు**
**పోరుపడలేక తానైన బ్రోవవలయు**
**ఒడలు తెలియక నీవైన అడుగవలయు**
**అంతియేగాని మధ్యలో ఆపివేసి**
**తిరిగిపోవుట భక్తుని దీక్ష కాదు**

ఇట్టి దీక్షయే నిజమైన తపస్సు. తపస్సు అనగా అడవులకు పోయి తల క్రింద పెట్టి, కాళ్ళు పైకి పెట్టి ధ్యానము చేయడం కాదు. మాటను దక్కించుకోవాలి. సత్యాన్ని కాపాడుకోవాలి. కృతజ్ఞతను చూపించాలి. ఆత్మవిశ్వాసం నిలుపుకోవాలి. ఇవే భక్తులకు ఉండవలసిన లక్షణాలు. ఎలాంటి ఇబ్బంది వచ్చినా లెక్కచేయకుండా ఆత్మను ఆధారం చేసుకొని జీవించాలి. ఆత్మగౌరవాన్ని కాపాడుకోవాలి. స్వార్థత్యాగానికి పూనుకోవాలి.

**'నేను' అనేదే దైవత్వం**

ఈనాటి మానవులు నమ్మకమనే రెండు నయనమ్ములే లేని అంధులైపోతున్నారు. ఎవ్వరినీ మీరు నమ్మవద్దు. కాని, మిమ్మల్ని మీరు నమ్మాలి కదా! Faith in yourself and faith in God is the secret of greatness.

నీపైన నీకు నమ్మకం ఉండడమంటే, దైవంపైన నమ్మకం ఉండడమే! ఎందుకంటే, నీయందే దైవము 'నేను'గా ఉంటున్నాడు. దైవమునకు ఒక ప్రత్యేకమైన ఆకారము లేదు. 'నేను' అనేదే దైవత్వము. వేదము "తత్త్వమసి", "ప్రజ్ఞానం బ్రహ్మ", "అహం బ్రహ్మాస్మి", "అయమాత్మా బ్రహ్మ" అనే నాల్గు మహావాక్యములను అందించింది. ఈ పవిత్రమైన వాక్యాలను అనేకులు ఉచ్చరిస్తున్నారేగాని, ఎంతమంది ఆచరిస్తున్నారు? ఆచరణలో పెట్టనిదంతా ఆడంబరమే! అందరియందు దైవం ఉన్నాడు. అందరినీ ప్రేమించాలని చెబుతూ కొందరిపైన విరోధం పూనడం చాలా పొరపాటు. మీకిష్టం లేని వారితో ఏమీ మాట్లాడవద్దు. మౌనంగా ఉండండి. అంతేగాని, వారిని చూసి అసహ్యపడవద్దు. వారిని ద్వేషించవద్దు. నేను అందరినీ ప్రేమిస్తున్నాను. నాకు ఎవ్వరిపైనా ద్వేషం లేదు. ఎవ్వరూ నాకు ద్వేషులు లేరు. అందరూ నాకు భక్తులే! బిడ్డలే! మిత్రులే! అందరూ ఒక్కటే! ఈ సత్యాన్ని మీరు గుర్తించి వర్తించాలి.

**నీవు, నేను ఒక్కటే**

ప్రేమస్వరూపులారా! మీయందున్న ప్రేమ, నాయందున్న ప్రేమ రెండూ ఒక్కటే! కాని, మీ ప్రేమ వస్తువాహనాదులపట్ల భ్రాంతితో కలుషితమై యున్నది. నాకు వస్తువాహనాదులపై ఎట్టి వాంఛలూ లేవు. నాది Pure Love (పరిశుద్ధమైన ప్రేమ). మీయందున్న ప్రేమ వాంఛలతో చేరడంచేత కొంత నెగెటివ్‌గా మారుతున్నది. నెగెటివ్ అనేది నాలో ఎంత వెతికినా చిక్కదు. నాదంతా పాజిటివే! 'నీవు, నేను ఒక్కటే' అనే భావంతో ఈ పాజిటివ్‌ను మీ నెగెటివ్‌తో చేర్చుకోండి. అప్పుడు మీ జీవితంలో ఎంతైనా ఆనందమును అనుభవిస్తారు. అది ఎట్టి ఆనందము? "బ్రహ్మానందం పరమ సుఖదం..." అప్పుడు మీరే బ్రహ్మస్వరూపులైపోతారు. మీరు ఏ సాధనలూ చేయనక్కర్లేదు. అయితే, సాధనలు చేయాలని ఇష్టముంటే, చేసుకోండి. తప్పు లేదు. ఇవన్నీ మీ మనోతృప్తి నిమిత్తమే చేస్తున్నారుగాని, ఆత్మతృప్తికోసం కాదు. అందరి యందు ఏకత్వాన్ని దర్శించండి. అందరికీ ప్రేమతత్త్వాన్ని పంచిపెట్టండి. ఇదే నిజమైన సాధన.

**దేవుడు ఒక్కడే!**

ఏ పేరుతో పూజించినప్పటికీ దేవుడు ఒక్కడే అనే సత్యాన్ని గుర్తించండి. "ఏక్ ప్రభూకే అనేక్ నామ్". మీరు సహస్ర నామార్చన చేసేటప్పుడు "కేశవాయ నమః, మాధవాయ నమః, నారాయణాయ నమః..." అని ఒక్కొక్క తూరి ఒక్కొక్క పేరు చెప్పి ఒక్కొక్క పుష్పము సమర్పిస్తారు. అయితే, ఒక్కొక్క పేరుకు ఒక్కొక్క రూపముందా అక్కడ? లేదే! ఒక్క రూపమునే ఇన్ని పేర్లతో పూజిస్తారు. అంతేకాదు. అంగపూజ చేసే సమయంలో 'నేత్రం సమర్పయామి' అంటారు. కాని, నిజంగా నేత్రమును సమర్పిస్తున్నారా? లేదు. ఒక పుష్పముతో నేత్రాన్ని స్పృశించి ఆ పుష్పాన్ని సమర్పిస్తున్నారు. చెప్పేది నేత్రము, ఇచ్చేది పుష్పము! ఇటువంటి పూజలను భగవంతుడుకూడా అంగీకరించడు. భగవంతుడు ప్రసాదించిన అంగములు భగవంతునికి ఎందుకు? "భగవంతుడా! అంతా నీదే! ఈ అంగములు నీవే! నేను నీవాడను. నీవు నావాడవు" అని భావించినప్పుడు ఇంక ఈ పూజలు అక్కర్లేదు. అయితే, అంత ఉన్నతస్థాయిలో లేనివారు జపం చేసుకోవచ్చు, ధ్యానం చేసుకోవచ్చు, చిన్నచిన్న పూజలు చేసుకోవచ్చు. తప్పు లేదు. ఇతే, మొట్టమొదట మీ దురభ్యాసములను, నెగెటివ్ భావాలను క్రమక్రమేణ నిర్మూలించుకోవాలి. పాజిటివ్ భావాలను అభివృద్ధి గావించుకోవాలి.

**ఏది జరిగినా మీమంచికే!**

ప్రేమస్వరూపులారా! మిమ్మల్ని దూషించినవారిని తిరిగి దూషించడానికి పూనుకోవద్దు. వారు దూషించేది

ఎవరిని? దేహాన్నే కదా! "ఓ దుష్టుడా!" అంటే, అది దేహానికి పెట్టిన పేరే! "ఈ దేహానికి నా తల్లిదండ్రులు ఒక పేరు పెట్టారు. నా మిత్రులు ఒక పేరు పెట్టారు. వీడొక పేరు పెడుతున్నాడు", అనే భావముతో పట్టించుకోకుండా ఉండాలి. ఎవరో మిమ్మల్ని 'దుష్టుడా!' అన్నంతమాత్రమున మీరు దుష్టులు కారు కదా! ఒకవేళ నిజంగానే మీలో ఏవైనా దోషాలుంటే, వాటిని నిర్మూలించుకోవడానికి ప్రయత్నించండి. మీరు ఎవ్వరినీ ద్వేషించకుండా సాధ్యమైనంతవరకు అందరినీ ప్రేమించండి. ఈనాడు లోకంలో ద్వేషము, అసూయ, డంబము ఇత్యాది దుర్గుణాలు అభివృద్ధి అవుతున్నాయి. వాటిని పోగొట్టుకోవడానికి ఒక్క ప్రేమతత్త్వం చాలు. మీ అభీష్టములు నెరవేరినా, నెరవేరకపోయినా 'ఏది జరిగినా మన మంచికే', అనే సత్యాన్ని గుర్తించి వర్తించాలి. మంచి, చెడ్డ రెండూ కలిసి ఉంటాయి. కాబట్టి, రెండింటిపట్ల సమత్వం వహించాలి. "సుఖదుఃఖే సమేకృత్వా లాభాలాభౌ జయాజయౌ". రెండు బాధల మధ్య విరామమే సుఖము. కోరికలు ఎంత పెరుగుతాయో ఆనందము అంత తరుగుతుంది. కోరికలు ఎంత తరుగుతాయో ఆనందము అంత పెరుగుతుంది. కాబట్టి, లౌకికమైన కోరికలను తగ్గించుకొని, దైవము కావాలనే కోరికను పెంచుకుంటే, ఎంతో హాయి కలుగుతుంది.

**"పత్రం పుష్పం ఫలం తోయం"**

శ్రీకృష్ణ తులాభార ఘట్టమునుగురించి మీకందరికీ తెలుసు. సత్యభామ స్వార్థంతో కృష్ణుని పూర్తిగా తనవాడిగా చేసుకోవాలని ఆశించింది. తన దగ్గరున్న బంగారంతో కృష్ణుని తూచడానికి ప్రయత్నించింది. శ్యమంతక మణిని కూడా వేసింది. కాని, కృష్ణుడు తూగలేదు. భగవంతుడు బంగారమునకు, ధనమునకు చిక్కుతాడా? అసాధ్యము. ఒక్క భక్తికి మాత్రమే చిక్కుతాడు. పవిత్రమైన గుణమునకు మాత్రమే చిక్కుతాడు. సత్యభామ పరుగెత్తుకొని వెళ్లి, రుక్మిణిని తీసుకువచ్చింది. ఆ సమయంలో తులసీ పూజ చేస్తున్న రుక్మిణి చేతిలో తులసీ దళాన్ని పట్టుకొని సత్యభామ వెంట వచ్చింది. నారదుని ద్వారా జరిగిన సంగతి తెలుసుకొని, 'కృష్ణరూపానికి కృష్ణనామమే సరియైన తూకము', అన్నది. దీనికి నారదుడు అభ్యంతరం తెలుపుతూ, "అమ్మా! కృష్ణుడు సాకారంగా ఉన్నాడు. ఇప్పుడు నా స్వాధీనంలో ఉన్నాడు. అతనిని నీకివ్వాలంటే నీవుకూడా ఏదైనా ఒక సాకారమైన వస్తువునివ్వాలి", అన్నాడు. అప్పుడు రుక్మిణి తన చేతిలో ఉన్న తులసీదళమును త్రాసులో వేసి, "పత్రమో పుష్పమో ఫలమో తోయమో... భక్తి కలిగినవానికి వశుడవగుట సత్యమేని కృష్ణా! నీవు ఈ తులసీ దళమునకు తూగుదువు గాక!" అన్నది. కృష్ణరూపాన్ని కృష్ణనామము సరిగ్గా తూచింది. ఆ తులసీ దళమునుకూడా వేసేటప్పటికి కృష్ణుడు కూర్చున్న వైపు త్రాసు పైకి పోయింది. పత్రమంటే ఏమిటి? దేహమే పత్రము. హృదయమే పుష్పము. మనస్సే ఫలము. ఆనంద బాష్పములే తోయము. భగవంతునికి అర్పించవలసినవి ఇవే!

**నా దగ్గర ఉన్నది ప్రేమధనమే!**

ప్రేమస్వరూపులారా! ప్రేమను పెంచుకోండి. అప్పుడు మీ అభీష్టములన్నీ సిద్ధిస్తాయి. ఎవ్వరినీ ద్వేషించకండి. ఇదియే సరియైన ఆదర్శము. ఇదే ఈనాడు నేను మీకందించే ముఖ్యమైన సందేశము. మీరు ప్రేమస్వరూపులు కావాలి, ప్రేమహృదయులు కావాలి, ప్రేమమయులు కావాలి, ప్రేమానందమును అనుభవించాలి. ఇదే ఈనాడు మీకిచ్చే గొప్ప బహుమతి. నాదగ్గర ఉన్నది ఈ ధనమే! ఈ భవనాలన్నీ నావి కావు. వీటిని భక్తులు కట్టించారు. భక్తులవే ఇవన్నీ. నాదగ్గర ఉన్న స్వంత ఆస్తి ప్రేమయే, ప్రేమయే, ప్రేమయే! ఆ ప్రేమను మీకు ఎంతైనా ఇస్తాను. కడపటికి దేహమైనా ఇస్తాను. మీరు ఆనందంగా జీవించండి. ఆదర్శవంతులుగా బ్రతకండి. అప్పుడు నాకు ఆనందము కలుగుతుంది. ఏది ఇచ్చినా నాకు ఆనందము కాదు. ప్రేమయే నాకు ఆనందము. నా ప్రేమయే మీకు సౌభాగ్యము. దానిని మీరు కాపాడుకోవాలని ఆశిస్తున్నాను.

(శ్రీవారు తమ అభయ హస్తాలనెత్తి ఆశీర్వదిస్తూ...) అందరూ ఈనాడు శాశ్వతమైన భక్తిని, పవిత్రమైన జీవితాన్ని, దీర్ఘమైన జీవితాన్ని, సుఖమయమైన జీవితాన్ని పొందుదురు గాక! పొందుదురు గాక! పొందుదురు గాక! మీ కష్టములన్నీ పరిహారమగు గాక! మీరు కష్టములను గురించి యోచించకుండా లభించిన సుఖాన్ని అనుభవిస్తూ రండి!